సమావేశంలో మాట్లాడుతున్న గౌస్‌దేశాయి

అపార నష్టం...

- అధిక వర్షాలకు 10,767.5 ఎకరాల్లో పంట నష్టం
- ప్రాథమిక అంచనా వేసిన వ్యవసాయ శాఖ
- సరైన సమయానికి కురవని వర్షం
- ఇంకా మొలకెత్తే దశలోనే పంటలు
- ఆశించిన స్థాయిలో ఖరీఫ్ గట్టెక్కేనా ?

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

వ్యవసాయ రంగం రోజు రోజుకు కుదేలవుతోంది. ఒక ఏడాది వర్షాభావ పరిస్థితుల వల్ల నష్టం. ఇంకొక ఏడాది అతివృష్టి వల్ల నష్టం అన్ని బాగుంటే గిట్టుబాటు ధర లేక నష్టం ఇలా ప్రతి సారి రైతులు తీవ్ర నష్టాలను చూస్తున్నారు. పెరుగుతున్న నష్టాలు, భారమవుతున్న వడ్డీలతో బలన్మరణాలు చేసుకుంటున్నారు. పంటలకు సరైన గిట్టుబాటు ధరలు లేకపోవడం, నాణ్యమైన విత్తనాన్ని అందక, మార్కెట్‌లలో గిట్టుబాటు ధర లేక రైతాంగం తీవ్ర నష్టాల పాలవుతుంది. ప్రభుత్వాలు మారుతున్నా రైతన్నను ఆదుకునే నాథుడు కరువయ్యారు. ప్రస్తుత ప్రభుత్వం రైతాంగాన్ని అడుకుంటుందనే ఆశలు రైతుల్లో చిగురిస్తున్నాయి.

అధిక వర్షానికి ఆలూరు గూళ్యంలో పొలాల్లో నిలిచిన వర్షపు నీరు (ఫైల్)

వేసిన పంటలకు వర్షపాతం లేనందున మొలక దశలోనే వాడుముఖం పట్టాయి. ఇలా రైతులకు తీవ్ర నష్టాలు వెంటాడుతున్నాయి. కాలువల కింద పంటలు కాపాడవచ్చు అనుకున్నా తుంగభద్ర డ్యామ్ 19వ గేటు కొట్టుకుపోవడం వల్ల ఖరీఫ్ సాగు నష్టాలు మిగులుస్తుందేమో.. ఖరీఫ్ సాగు గట్టెక్కుతుందా.. అనే అనుమానాలు రైతుల్లో తీవ్ర నిరాశను కలిగిస్తుంది. ఖరీఫ్ సాదారణ సాగు 10,48,052.5 ఎకరాలు కాగా ప్రస్తుతం 7,85, 810 ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. దెబ్బ తిన్న పంటలకు ప్రభుత్వం నష్టపరిహారాన్ని వెంటనే చెల్లించాలని రైతులు కోరుతున్నారు.

10,767.5 ఎకరాల్లో పంటలు నష్టం

ఈనెలలో నెలలో కురిసిన అధిక వర్షాలకు జిల్లాలో దాదాపు 10,767.5 ఎకరాలలో పంటలు దెబ్బతిన్నాయి. ఈ నష్టాన్ని వ్యవసాయ శాఖ అధికారులు ప్రాథమిక అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక పంపారు. అంతమటుకే జరిగిన సాగులో మళ్ళీ పంట నష్టం జరగడం వల్ల రైతుల్లో తీవ్ర ఆందోళనలు చెందుతున్నారు. రావాల్సిన నష్టపరిహారం, సున్నావడ్డీ రుణాలు, రైతు భరోసా లాంటి పథకాలు చేతికి రాకపోవడం, వేసిన పంటలు కళ్లెదుటే కొట్టుకుపోతుంటే రైతుల గుండెలు ఆగిపోతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

దెబ్బ తిన్న పంటలు...

వరి 1375 ఎకరాలు, పత్తి 6943.5 ఎకరాలు, వేరుశనగ 592.5, కంది 1600.725 ఎకరాలు, ఆముదం 45 ఎకరాలు, సజ్జ 195, కొర్ర 12.5, ప్రొద్దుతిరుగుడు 5 ఎకరాలలో నష్టం జరిగిందని వ్యవసాయ శాఖ అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. వాస్తవానికి క్షేత్ర స్థాయిలో ఇంకా ఎక్కువ స్థాయిలో పంటలు దెబ్బతిన్నాయని రైతులు తెలువుతున్నారు. ఈ పంటలకు నష్టపరిహారం ప్రభుత్వం అందిస్తుందా ? లేక కాగితాలకు పరిమితం అవుతుందా ? అని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సరైన సమయానికి కురవని వర్షం..

నైరుతి రుతుపవనాలు జూన్ మొదటి వారంలో వచ్చినా రైతులకు ఆశించిన స్థాయిలో వర్ష కురువలేదు. జులైలో దాదాపు 37 శాతం లోటు వర్షాపాతం నమోదవడం, ఆగస్టు నెలలో 15న వర్షం లేకపోవడంతో సకాలంలో పంటలు సాగు కాలేదు. జూన్ నెలలో

పొలాల్లో నిలిచిన వర్షపు నీరు (ఫైల్)

ఖరీఫ్ ప్రధాన పంటల సాగు వివరాలు..

పంట	సాధారణ సాగు	ఖరీఫ్ సాగు	శాతం
వేరుశనగ	58,969	42,672	72.36
పత్తి	2,43,689	1,90,076	78.00
మిరప	29,998	13482	44.9
ఉల్లి	15,698	9,817	62.54
టమోటా	2,606	1,508	57.86
కంది	25,557	31,118	121.76
మొక్కజొన్న	4,652	3,502	75.28

పంట నష్టం వివరాలు ప్రభుత్వానికి నివేదించాం

- పిఎల్ వరలక్ష్మి వ్యవసాయ శాఖ జిల్లా అధికారి

అధిక వర్షాలకు కొన్ని మండలాల్లో పంటలు నష్టం జరిగింది. వాటి ప్రాథమిక అంచనా వేసి నష్టపోయిన పంట వివరాలు నమోదు చేశాం. ఉన్నతాధికారుల సూచనల మేరకు తగిన చర్యలు తీసుకుని రైతులకు న్యాయం చేసేలా చర్యలు తీసుకుంటాం.

విద్యుత్ పోరాట స్ఫూర్తితో

సంస్కరణలను తిప్పికొట్టాలి

- విద్యుత్ అమరవీరుల సంస్మరణ సభలో గౌస్‌దేశాయి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

విద్యుత్ అమరవీరుల పోరాట స్ఫూర్తితో నేటి పాలకులు తెస్తున్న విద్యుత్ సంస్కరణలను తిప్పికొట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయి సూచించారు. విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా పోరాటం చేయడం ద్వారానే ఆనాటి పోరాటంలో అమరులైన సత్తెనపల్లి రామకృష్ణ, బాలస్వామి, విష్ణువర్ధన్ రెడ్డిలకు నిజమైన నివాళి అని డి.గౌస్‌దేశాయ్ అన్నారు. బుధవారం కర్నూలు సుందరయ్య భవన్‌లో సిపిఎం న్యూ సిటీ కార్యదర్శి టి. రాముడు అధ్యక్షతన విద్యుత్ అమరవీరుల సంస్మరణ సభ నిర్వహించారు. రామకృష్ణ ,బాలస్వామి, విష్ణువర్ధన్ రెడ్డిల చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా జరిగిన సభను ఉద్దేశించి గౌస్‌దేశాయ్ మాట్లాడుతూ ప్రపంచ బ్యాంకు షరతులకు తలొగ్గిన నాటి తెలుగుదేశం ప్రభుత్వం విద్యుసంస్కరణలను చేపట్టిందన్నారు. వామపక్షాల ఆధ్వర్యంలో ఉమ్మడి రాష్ట్రంలో విద్యుత్ మహోద్యమం ఉవేత్తున సాగిందన్నారు. 2000 సంవత్సరం ఆగస్టు 28న హైదరాబాద్ లోని బషీర్‌బాగ్‌లో విష్ణువర్ధన్ రెడ్డి, బాలస్వామి, రామకృష్ణలు అమరులయ్యారని తెలిపారు. ఆ పోరాటం దేశవ్యాప్తంగా ప్రపంచ బ్యాంకు షరతులు అమలు గాకుండా నిలబెట్టిందని, అది ఆ అమరవీరుల త్యాగాల ఫలితమే అని గుర్తు చేశారు. ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వాలు విద్యుత్ భారాలు ప్రజలపై వేయాలంటే భయపడే పరిస్థితి వచ్చిందని, కొన్ని సంవత్సరాలపాటు ప్రజల పైన భారం లేకుండా ఆ పోరాటం చేయగలిగిందన్నారు. రాష్ట్ర విడిపోయిన తర్వాత అధికారంలోకి వచ్చిన వైసిపి, తెలుగుదేశం ప్రభుత్వాలు నేరుగా కాకుండా దొడ్డి దారిన ప్రజలపై విద్యుత్ భారాలు వేయడం కోసం మార్గాలు వెతుక్కున్నాయని తెలిపారు. 2019లో రెండోసారి అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం 2021 లో విద్యుత్ సంస్కరణలు దేశవ్యాప్తంగా తీసుకొని వచ్చే ప్రయత్నం చేసిందని, ఆ సంస్కరణను అందరికంటే ముందు రాష్ట్రంలో ఉన్న ఆనాటి వైసిపి ప్రభుత్వం అమలు చేయడానికి పూనుకున్నదని విమర్శించారు. ట్రూ ఆఫ్ చార్జీల పేరుతో రూ.9863 కోట్ల భారాలు వేసిందన్నారు. కార్పొరేట్ కంపెనీలతో లాలూచీపడి కేంద్ర ప్రభుత్వం ఒత్తిడికి తలొగ్గి రైతుల వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించే కార్యక్రమాన్ని వైసిపి ప్రభుత్వం చేపట్టిందని, దానికి వ్యతిరేకంగా రాష్ట్రంలో రైతులు పెద్ద ఎత్తున ఉద్యమించడం వల్ల తాత్కాలికంగా వెనుక్కు తగ్గారని తెలిపారు. స్మార్ట్ మీటర్లు, వ్యవసాయ పంపు చెట్లకు మీటర్లు పెడుతుంటే తెలుగుదేశం పార్టీ అవే స్మార్ట్ మీటర్లు పెట్టడం కోసం పూనుకోవడం దుర్మార్గమైన చర్య అని ఆయన ఘాటుగా విమర్శించారు. రాష్ట్రంలో ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల విధానాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. తిరిగి ప్రజలపై భారం వేయాలని చూస్తే ప్రజల్ని సమీకరించి ఇండియా కూటమికి వ్యతిరేకంగా పోరాటం చేయడం ద్వారా మాత్రమే విద్యుత్తు అమరవీరులకు అర్పిస్తున్న ఘనమైన నివాళి అని ఆయన తెలిపారు. సిపిఎం ,వామపక్ష పార్టీ కార్యకర్తలు ఈ విద్యుత్ విధానాన్ని వ్యతిరేకంగా రాబోయే కాలంలో పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రామాంజనేయులు, రాధాకృష్ణ, నారాయణ, వెంకటేశ్వర్లు జిల్లా నాయకులు ఆనంద్‌బాబు, అరుణ, ఓల్డ్ సిటీ కార్యదర్శి రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

వినాయక నిమజ్జనానికి పక్కా ఏర్పాట్లు

మాట్లాడుతున్న జెసి

- జెసి నవ్య

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

సెప్టెంబర్ 15న కర్నూలు నగరంలో వినాయక నిమజ్జనం ఉత్సవం సజావుగా జరిగేలా పక్కాగా ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ లో జాయింట్ కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ సెప్టెంబర్ 15న నిర్వహించనున్న వినాయక నిమజ్జనం ఉత్సవ నిర్వహణకు సంబంధించి ఆయా శాఖలకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. నిమజ్జనానికి ముందు రోజు నుండి మద్యం అమ్మకాలు జరగకుండా డ్రై డే పాటించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ శాఖ అధికారులను ఆదేశించారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చూసుకోవాలన్నారు. ఆరు ఘాట్ల వద్ద లైఫ్ జాకెట్ లు, బోట్లు, గజ ఈతగాళు అందుబాటులో ఉండే విధంగా మత్స్య శాఖ అధికారి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి, డిఆర్‌ఒ మధుసూదనరావు, కర్నూల్ ఆర్డిఓ శేషి రెడ్డి, పత్తికొండ ఆర్డిఓ రామలక్ష్మి, ఆదోని ఆర్డీవో విశ్వనాథ్, గణేష్ ఉత్సవం జిల్లా అధ్యక్షులు వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా సవరణ షురూ

- బిఎల్‌ఒల ఇంటింటి పరిశీలన - ఓటు హక్కు నమోదుకు దరఖాస్తులు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఓటర్ల జాబితా సవరణలో భాగంగా ఓటు హక్కు నమోదుకు రాష్ట్ర ఎన్నికల సంఘం చర్యలు చేపట్టింది. ఈ మేరకు ఓటర్ల జాబితా సవరణకు ఈనెల 20న జిల్లా ఎన్నికల అధికారి , కలెక్టర్ నోటిఫికేషన్ విడుదల చేశారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేందుకు దరఖాస్తులను స్వీకరిస్తారు. ఓటర్ల జాబితా సవరణ 2024లో భాగంగా ఓటర్ల జాబితాలో మార్పులు చేరుకులతో పాటు కొత్తగా ఓటు హక్కు నమోదుకు దరఖాస్తులను స్వీకరిస్తారు. ఓటర్ సవరణలో భాగంగా బిఎల్వోలు ఇంటింటి సర్వే చేపట్టి ఓటర్ల జాబితాను పరిశీలన చేస్తారు. ఈ ప్రక్రియను అక్టోబర్ 20 వరకు నిర్వహిస్తారు. అక్టోబర్ 29న సమగ్ర ఓటర్ల జాబితాను పోలింగ్ కేంద్రాల్లో ప్రచురిస్తారు. అక్టోబర్ 29 నుండి నవంబర్ 28 వరకు ఈ జాబితా పై అభ్యంతరాలను దరఖాస్తులను స్వీకరిస్తారు. నవంబర్ 9,10 , 23,24 తేదీలలో బిఎల్ఒ ల ద్వారా ప్రత్యేక క్యాంపులను నిర్వహిస్తారు. డిసెంబర్ 24 తేదీలోగా అభ్యంతరాలను పరిష్కరిస్తారు. 2025 జనవరి 6వ తేదీన ఇది ఓటర్ల జాబితాను ప్రకటిస్తారు.

మైనార్టీ హాస్టల్‌లో వసతులు కల్పించాలి

- వినూత్న రీతిలో ఎస్ఎఫ్ఐ కుర్చీకి వినతిపత్రం

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి కన్నా కార్యాలయంలో ఆయన కుర్చీకి ఎస్ఎఫ్ఐ నాయకులు బుధవారం వినతి పత్రం అందజేశారు. కర్నూలు నగరంలోని గణేష్ నగర్ లో మైనారిటీ సంక్షేమ పోస్ట్ మెట్రిక్ హాస్టల్‌లో మౌలిక వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంగప్ప, అబ్దుల్లా పేర్కొన్నారు. హాస్టల్ లో పురుగుల అన్నం పసుపు నీళ్లు తినలేక అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. మెనూ సరిగా పాటించకుండా పురుగుల అన్నం పసుపు నీళ్లు పెట్టడంతో అక్కడ ఉన్న విద్యార్థులు తీసుకోవడం లేదన్నారు. జిల్లా కలెక్టర్ వెంటనే ఈ హాస్టల్ ను సందర్శించి మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి సాయి ఎస్ఎఫ్ఐ నగరం ఉపాధ్యక్షులు అబుబక్కర్ సాయి కార్యదర్శిలు మల్లేష్ ఆర్యన్ హాస్టల్ విద్యార్థులు అక్బర్ మునీర్ తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ కుర్చీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

లంచ్ అవర్‌లో నిరసన తెలపుతున్న ఉపాధ్యాయులు

వర్క్ అడ్జస్ట్‌మెంట్ అసంబద్ధతలను తొలగించాలి

లంచ్ అవర్‌లో ఉపాధ్యాయుల నిరసన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఉపాధ్యాయుల వర్కఅడ్జెస్ట్‌మెంట్ ప్రక్రియలో అసంబద్ధతలను తొలగించాలని మున్సిపల్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు టి.వెంకట్ రెడ్డి , మున్సిపల్ ఉపాధ్యాయుల జెఎసి చైర్మన్ ఇబ్రహీం డిమాండ్ చేశారు. బుధవారం మున్సిపల్ జెఎసి ఆధ్వర్యంలో కర్నూలు నగరంలో మున్సిపల్ పాఠశాలల్లో సమస్యల పరిష్కారం కోసం భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వెంకట్ రెడ్డి , ఇబ్రహీం మాట్లాడుతూ మున్సిపల్ పాఠశాలలో అప్‌గ్రేడ్ కాబడిన పాఠశాలలకు పోస్టులు మంజూరు, పాఠశాల విద్యార్థుల సంఖ్యను బట్టి ఉపాధ్యాయులను నియమించకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్ పాఠశాలలతో సమానంగా అన్ని సౌకర్యాలు కల్పిస్తామని చెప్పిన విద్యాశాఖ అధికారులు మున్సిపల్ పాఠశాలల గురించి పట్టించు కోవడం లేదన్నారు. మున్సిపల్ విద్యా వ్యవస్థలో ఉన్న పాఠశాలలకు పోస్టులు అవసరమైనప్పటికిని ఈ విధానం అమలు చేయలేదన్నారు. టీచర్లకు వర్క్అడ్జస్ట్ మెంట్ కింద ఉన్నత, ప్రాథమి కోన్నత పాఠశాలలకు సర్దుబాటు చేసి, అనంతరం మిగిలిన లిఉపాధ్యాయులను ప్రాథమిక పాఠశాలకు సర్దుబాటు చేయాలన్నారు. జెఎసి కో చైర్మన్ ఈ రాముడు సెక్రటరీ జనరల్ ఎస్ రాముడు సి మున్సిపల్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

ఎపి రైతు సంఘం డిమాండ్

ప్రజాశక్తి-పత్తికొండ

పది రోజుల క్రితం ఎగువ ప్రాంతంలో మద్దికేర, పత్తికొండ మండలాల్లో అధిక వర్షం కురవడం వల్ల హంద్రీ వాగు పరివాహక ప్రాంత పంట పొలాలు వర్షపు నీరుతో మునిగి పంటలు పూర్తిగా నష్టపోయిన రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలని ఎపి రైతు సంఘం మండల కార్యదర్శి సిద్దయ్య గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన పత్రికా విలేకరులతో మాట్లాడారు. పత్తికొండ మండలం పెద్దహుల్తి, చిన్నహుల్తి, జూటూరు, హోసూరు, కోతిరాల గ్రామాలలో ఖరీఫ్ సీజన్లో సాగుచేసిన పత్తి ,టమోటా, కొర్ర, సజ్జ, వేరుశనగ తదితర పంటలు అధిక వర్షపు నీరు పంట పొలాలు పూర్తిగా మునిగిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. మండల వ్యవసాయ అధికారులు పత్తి, వేరుశనగ, కంది, ఆముదం ,జొన్న తదితర పంటలు 486 హెక్టార్లలో 387 మంది రైతులు, ఉద్యాన పంటలలో టమోటా మిరప ఉల్లి తదితర పంటలను 324 హెక్టార్లలో 372 మంది రైతులను గుర్తించి జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక అందజేసినా నష్టపరిహారం అందించడంలో వ్యవసాధికారులు పూర్తిగా విఫలం చెందారన్నారు. ఎకరాకు రూ.50 వేల నష్టపరిహారం వారంలోపు రైతుల ఖాతాలోకి జమ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో నష్టపోయిన రైతులను కలుపుకొని కర్నూలు కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

ఆర్‌టిసి బస్టాండులో పడకేసిన పారిశుధ్యం

ఆర్‌ఎంకు పిపిఎస్‌ఎస్ వినతి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

రాయలసీమకు ముఖద్వారమైన కర్నూలు బస్టాండులో పారిశుధ్యం పడకేయడంతో దుర్వాసన భరించలేక ప్రయాణికులు ముక్కు మూసుకొని ఊపిరి బిగబట్టుకొని పోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు ఇరిగినేని పుల్లారెడ్డి, సివివర్మ, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధి టి.మద్దిలేటి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం పట్టణ పౌర సంక్షేమ సంఘం ప్రతినిధి బృందం ఆర్‌టిసి బస్టాండ్ లో పర్యటించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒకప్పటి రాజధాని.. రాష్ట్రంలో అతిపెద్ద రెండవ ఆర్‌టిసి బస్టాండు, కానీ పేరు పెద్ద ఉరి దిబ్బ అనే చందంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. చెత్త పేరుకొని పోయి దుర్వాసన వస్తుందన్నారు. మూత్రశాలలు, మరుగుదొడ్లు శిథిలమై మురుగు నీరు రోడ్లపై ప్రవహిస్తున్నాయన్నారు. మూత్రశాలల్లో మరుగుదొడ్లలో అడుగు తీసి అడుగుపెట్టే పరిస్థితి లేదన్నారు. బస్టాండ్ లోనే ఉన్న ఆర్‌టిసి అధికారులు చూసి చూడనట్లు బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నారన్నారు. వెంటనే పారిశుధ్యాన్ని మెరుగుపరిచి, శిథిలమైన మూత్రశాలలు మరుగుదొడ్లు, బస్టాండ్‌లో గుంతలను మరమ్మతులు చేయడంతో పాటు ప్రజలకు అందుబాటులో మరిన్ని మూత్రశాలలు, మరుగుదొడ్లు నిర్మించాలన్నారు. జిల్లా ప్రజా రవాణా అధికారికి వినతి పత్రం అందజేశారు. పిపిఎస్‌ఎస్ నగర నాయకులు ఎన్. శ్రీనివాసరెడ్డి, కె.గోపీనాథ్, ఎస్.షాకీర్, ఎస్.జయప్రకాశ్‌రెడ్డి, ఎస్. శంషుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

భాష నా జీవన వర్ణమాల

తల్లి గర్భాన పిండంగా ఉండగానే
అమ్మ చెప్పిన కథలు విన్న అభిమన్యుడులా నేను
తల్లిపాలలో మురిపాలను కలిపి
ఉగ్గుపాలతో తెలుగును నూరిపోసింది
ఆమె జోలపాటల లాలనతో
చెవులు శ్రవణానందం పొందాయి
గోరుముద్దల గారావంతో
తెలుగు పదాల రుచులు అందించింది
యాభైయ్యారు అక్షరాలతో ముడివేసిన
అమ్మ పేగు బంధమది
ఆ వారసత్వ పలుకుల పదాల సవ్వడే
నాలో వర్ణమాలతో మొదలై
ప్రబంధవర్ణనల స్వర్ణ యుగమైంది అమ్మ స్వరం నాలో కలిసి
సుస్వరాల సుమధుర గానమై పాటగా పరవశించింది
అచ్చులతో అంతమయ్యే అరుదైన
అజంత సుందర శిల్పం నా తెలుగు భాష
అది కథై కమ్మని కథానికై సమ్మోహనం చేసింది
శతకమై శతావధానమై
అష్టావధానమై అవనిలోనే విశిష్టత చాటింది
కవితై కావ్యకన్యకై
నవలై నాటకమై నృత్యంతో నేత్రానందం చేసింది
హృద్య పద్యమై గంభీర గద్యమై
ఆరున్నొక్క రాగమై ఆంధ్రదేశమంతా మారుమ్రోగింది
ఆత్మకథై అంతరాత్మను ఆవిష్కరించింది
సినిమా సాహిత్యమై వెండితెరపై వెలుగులు విరజిమ్మింది
అలంకారాలతో తెలుగు కళామతల్లి సిగలో
శిరోరత్నభూషణమైంది

- ఆవుల బసప్ప , పాఠశాల సహాయకులు (తెలుగు)
జిల్లా అధ్యక్షులు -సాహితీ స్రవంతి (నేడు తెలుభాషాదినోత్సవం)

ఎంబుక్ మాయం పై ఎంపిటిసిల రసాభాస

-రూ.39 లక్షలకు లెక్కచెప్పాలని సభ్యులు పట్టు
-పనులు పారదర్శకంగా జరగాలి: బొగ్గుల దస్తగిరి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు మండల సర్వసభ్య సమావేశం బుధవారం రసాభాసగా సాగింది. ఎంపిపి వాసు వెంకటేశ్వరమ్మ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి తొలిసారిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సభ్యులు పలు సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఈ మేరకు ప్రధానంగా బి.తాండ్రపాడు ఎంపిటిసి కురువ మద్దిలేటి ఉల్చాల గ్రామంలో జరిగిన అభివృద్ధి పనులకు సంబంధించి రూ.39 లక్షలకు లెక్కలు చెప్పాలని ఎంపిటిసిని నిలదీశారు. పనుల్లో తీవ్ర అవినీతి చోటుచేసుకుందని ఆరోపించారు. వర్షాకాలంలో విద్యుత్తు ఐరన్‌పోల్స్ వల్ల ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉందని, వాటిని వెంటనే మార్చాలని ఈ.తాండ్రపాడు సర్పంచి బాలపీర, దిన్నేదేవరపాడు సర్పంచి మాధవస్వామి, తొలిసాపురం సర్పంచి గిడ్డయ్య, ఎంపిటిసి మద్దిలేటి, ఎలక్ట్రికల్ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అందుకు స్పందించిన ఏఇ ఆంజనేయ శాస్త్రి పోల్లను వెంటనే పరిశీలించి సమస్య లేకుండా చేస్తామని, త్వరలోనే సిమెంటు పోల్స్ ఏర్పాటు చేస్తామని చెప్పారు.

పారదర్శకంగా పనులు జరగాలి -ఎమ్మెల్యే

మండలంలో నిర్వహించే అభివృద్ధి పనులను పారదర్శకంగా నిర్వహించాలని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. మండలంలో అభివృద్ధి పనులకు సంబంధించి ఎలాంటి సమస్యలు ఎదురైనా తన దృష్టికి తీసుకురావాలని నిధుల కోసం తన వంతు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.ఎంపిడిఒ అనురాధ ఎఇ రవి మోహన్ రెడ్డి, ఎఇఆర్‌డి వివిధ శాఖల మండల అధికారులు పాల్గొన్నారు.

ఇసుక బుకింగ్ కు విశేష స్పందన

ప్రజాశక్తి- కర్నూలు క్రైమ్

జిల్లాలో ఇసుక బుకింగ్‌కు విశేష స్పందన లభించిందని కర్నూలు మైనింగ్ జిల్లా డిడి రాజశేఖర్ తెలిపారు. ఇసుక బుకింగ్ ప్రారంభించిన తొలి రోజున జిల్లాలో 195 బుకింగ్లకు గాను 3312 టన్నులు ఇసుక ను వాహనాలకు లోడు చేశామన్నారు. సి బెలగల్ మండలంలోని రీచ్ నుంచి 80 బుకింగ్లకు గాను 1034 టన్నులు, కర్నూలు మండల రీచ్ నుంచి 115 బుకింగ్స్‌కు గాను 2278 టన్నులు లోడింగ్ చేశామన్నారు. ఇందులో 150 టిప్పర్లు, 45 ట్రాక్టర్లు లోడ్ అయ్యాయి అన్నారు. గురువారం నుంచి ఈ బుకింగ్లు ఉదయం 6 గంటలకు సాయంత్రం 6 గంటల వరకు కొనసాగుతాయి అన్నారు.

ఉషు క్రీడాకారులతో సిఇఒ రమణ, ఛీఫ్‌కోచ్ భూపతి రావు, తదితరులు

రాష్ట్ర ఉషు పోటీలకు జిల్లా జట్టు ఎంపిక

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

రాజమండ్రిలో జరగనున్న సబ్ జూనియర్, సీనియర్ రాష్ట్రస్థాయి ఉషు పోటీలలో పాల్గొనే జిల్లా జట్టు క్రీడాకారులకు బుధవారం కర్నూలు స్పోర్ట్స్ అథారిటీ అవుట్ డోర్ స్టేడియంలో దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా ఉషు సంఘం అధ్యక్షులు జగదీష్, సెట్కురు సిఇఒ రమణ, డిఎస్‌డిఒ భూపతి రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నారులు చదువుతోపాటు ఉషు మార్షల్ ఆర్ట్‌లో రాణించాలని, పోటీల్లో మంచి ప్రతిభను చూపి, రాష్ట్రస్థాయిలో పతకాలు సాధించాలని, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు. అనంతరం క్రీడాకారులకు దుస్తులు పంపిణీ చేశారు. సబ్ జూనియర్ ఈవెంట్లో 18 మంది బాలురు, 18 మంది బాలికలు పాల్గొన్నారు. సీనియర్ ఈవెంట్లో పదిమంది స్త్రీలు, ఇద్దరు పురుషులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కోచ్ లు చిన్న శ్రీనివాసులు, నాగ సులోచన, జిల్లా ఉషు సంఘం కార్యదర్శి టి. శ్రీనివాసులు తెలిపారు.

రోడ్డు బాగుకోసం వరినాట్లతో నిరసన

ప్రజాశక్తి -సి బెళగల్

పోల కల్ నుండి ఎమ్మిగనూరు వరకు సి బెళగల్ మీదుగా రోడ్ల పురోగతి చేపట్టాలంటూ సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జె మోహన్ అధ్యక్షతన మండల ప్రజా సంఘాలు ఆధ్వర్యంలో రోడ్డుపై వరి నాట్లు వేస్తూ నిరసన తెలిపారు. కోడుమూరు నియోజకవర్గంలో మారుమూల మండలంగా సి బెళగల్ ఉందని పేరుకే మండల కేంద్రమని, అభివృద్ధి శున్యమని తెలిపారు. 30 ఏళ్ల కిందట వేసిన బీటి రోడ్డు ఇంతవరకు వేసినట్లు లేదని, 15 యేళ్లుగా ప్యాచీలు వేస్తున్నా అధ్వాన్నస్థితి నుండి మార్పు లేదని అన్నారు. సి బెళగల్ లో హైస్కూల్ నుండి పలుకుదొడ్డి రోడ్డు వరకు సుమారు కిలోమీటర్ మేర బీటి రోడ్డు ఆనవాళ్లు కానరావడం లేదని గుంతలు ఏర్పడి వర్షపు నీరు చేసి కుంటలుగా దర్శన మివ్వడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని ఎంపిడిఒ రాముడుకు వినతిని అందజేశారు. నాయకులు, కార్యకర్తలు సుందరాజు, రంగన్న, బందెనవాజ్, భాస్కర్, సంటెన్న, గోపాల్, వెంకటేష్,నల్లారెడ్డి యేసు, ప్రభుదాసు, జైలు, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి సుధా

లోక్ అదాలత్‌తో సత్వర పరిష్కారం

- ఆదోని రెండో అదనపు కోర్టు జడ్జి సుధా

ప్రజాశక్తి - ఆదోని

లోక్ అదాలత్ ద్వారా సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుందని, జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకునేలా చూడాలని ఆదోని రెండో అదనపు కోర్టు జడ్జి సుధా తెలిపారు. బుధవారం కోర్టు హాలులో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. సెప్టెంబర్ 14న జరగబోయే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువమంది కక్షిదారులు పాల్గొనేలా చూడాలన్నారు. ఏ స్టేషన్‌లో ఎన్ని కేసులు పెండింగ్ ఉన్నాయి.. ఎన్ని కేసులు రాజీ చేయగలరని పోలీసు అధికారులను అడిగారు. ప్రజలకు లోక్ అదాలత్ గురించి అవగాహన కల్పించి కౌన్సెలింగ్ ఇచ్చి కేసులు పరిష్కరించడానికి సహకరించాలని కోరారు. జ్యుడీషియల్ ఆఫీసర్స్, సీనియర్ సివిల్ జడ్జి యజ్ఞ నారాయణ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జి.అర్చన, మొదటి శ్రేణి అదనపు న్యాయమూర్తి సాయి లీల సుభాష్, రెండో శ్రేణి అదనపు న్యాయమూర్తి సాయి శ్రీవల్లి, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎల్‌కె.సుందర్ సింగ్ ఉన్నారు.

రసాభాసగా సర్వసభ్య సమావేశం

- సమస్యలపై అధికారులను నిలదీసిన ప్రజాప్రతినిధులు

మాట్లాడుతున్న ఎంపిపి జూటూరు హేమలత

ప్రజాశక్తి - చిప్పగిరి

ప్రజాప్రతినిధులందరూ సమస్యలపై గళమెత్తిన నేపథ్యంలో సర్వసభ్య సమావేశం రసవత్తరంగా సాగింది. గందరగోళ పరిస్థితి నెలకొంది. బుధవారం మండల కార్యాలయంలో ఎంపిపి జూటూరు హేమలత అధ్యక్షతన పరిపాలన అధికారి శ్రీనివాసులు ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ట్రాన్స్‌కో ఎఇ ఉల్లిగన్న, ఎంఇఒ సావిత్రమ్మ మాట్లాడుతుండగా డేగులపాడు సర్పంచి నీలకంఠ, నగరడోన సర్పంచి మల్లమ్మ పలు సమస్యలపై వారిని నిలదీశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్య బోధనపై ప్రాధాన్యత పెంచాలని, అలాగే విద్యార్థుల తాగునీటి కోసం ఏర్పాటు చేసిన ఫిల్టర్ మిషన్లు చెడిపోయినా పట్టించుకోవడం లేదని సభ దృష్టికి తెచ్చారు. నంచర్ల గ్రామంలో ఇనుప స్తంభం తీయించి సిమెంట్ స్తంభం వేయాలని అడుగుతున్నా ఇప్పటివరకు వేయడం లేదని సభ దృష్టికి తెచ్చారు. ఎఒ జయలక్ష్మి మాట్లాడుతూ... అధిక వర్షాలతో నష్టపోయిన రైతులు వెంటనే తమ పరిధిలో ఉన్న అగ్రికల్చర్ అసిస్టెంట్‌తో సంప్రదించి పంట నష్టపోయిన సమాచారమంతా వారితో పంట నమోదు చేయించి క్రోడీకరించుకోవాలని తెలిపారు. ఎపిఎం నాగార్జున, ఎపిఒ మాధవ శంకర్ తమ శాఖల్లో జరిగిన పనులను వివరిస్తూ జరగబోయే అభివృద్ధి పనుల ను కూడా సభలో వివరించారు. రెవెన్యూ శాఖపై తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్ ప్రజా ప్రతినిధులకు వివరించారు. వైస్ ఎంపిపి నరసింహులు, ఎంపిటిసిలు రజిని, భీమలింగ, సుంకన్న, సర్పంచులు గోవిందరాజులు, సుశీలమ్మ, పురుషోత్తం, సావిత్రి, రమాదేవి, రోహిణి, పిఆర్ ఎఇ చోలా రెడ్డి, ప్రభుత్వ డాక్టర్ పార్వతమ్మ, సిహెచ్ఒ వెంకటేశ్వర్లు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ప్రసూన, హౌసింగ్ అధికారి భవ్య, వెటర్నరీ అధికారి ప్రసన్న బాయి పాల్గొన్నారు.

వివాహ వేడుకలో రాకేష్ రెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

టిడిపి నియోజకవర్గ నాయకులు ఎన్.రాఘవేంద్ర రెడ్డి కుమారుడు, యువ నాయకులు ఎన్.రాకేష్ రెడ్డి వివాహ వేడుకలో పాల్గొని నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం స్థానిక హెచ్‌ఆర్‌బి కళ్యాణ మండపంలో జరిగిన వడ్డే పెద్ద ఈరన్న (కప్పన్న) కుమార్తె మీనా వివాహానికి ఆయన హాజరయ్యారు. టిడిపి పట్టణ ఇన్‌ఛార్జీ బి.వరదరాజులు, ఎంపిటిసి నక్కి వెంకటేష్, నాయకులు అశోక్ రెడ్డి, టైగర్ రఘు, శివ, రఘు పాల్గొన్నారు.

పాల్గొన్న రాకేష్ రెడ్డి

సాగునీటి సమస్యలపై స్పందించండి

- ఎంపిపికి వ్యకాస వినతి

ప్రజాశక్తి- దేవనకొండ

మండలంలో రైతులు ఎదుర్కొంటున్న సాగునీటి సమస్యలపై మండల ప్రజాప్రతినిధులు స్పందించాలని, పరిష్కారానికి ప్రయత్నం చేయాలని వ్యకాస జిల్లా అధ్యక్షులు బి.వీరశేఖర్ డిమాండ్ చేశారు. బుధవారం దేవనకొండ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సందర్భంగా రైతుసంఘం, వ్యకాస ఆధ్వర్యంలో నిరసన చేపట్టి, మండల ప్రజాప్రతినిధులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలో సాగునీటి ప్రధాన వనరయిన హంద్రీనీవా సమస్యలు 20 ఏళ్లుగా నానుతున్నాయని తెలిపారు. ప్రభుత్వాలు మారినా పట్టించుకోవడం లేదని వాపోయారు. గతంలోని ప్రభుత్వాలు 20 ఏళ్లుగా హంద్రీనీవాపై నిర్లక్ష్యం వహించాయని పేర్కొన్నారు. హంద్రీనీవా ప్రధాన కాలువ పనులు కరివేముల, తెర్నేకల్ మధ్య, కప్పట్రాళ్ల దగ్గర పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. వాటిని పూర్తి చేసేందుకు ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని కోరారు. 46 వేల ఎకరాలకు సాగునీరు ఇస్తామన్న ప్రభుత్వాలు ఆచరణలో పంట కాలువల నిర్మాణం చేపట్టలేదని చెప్పారు. వెంటనే పంట కాలువల నిర్మాణానికి ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని కోరారు. గుండ్లకొండ దగ్గర స్లూయిజ్ ఏర్పాటు చేస్తే 10 వేల ఎకరాలకు అదనంగా సాగునీరు, మండలంలోని చెరువులకు నీరు మళ్లించే అవకాశం ఉందని తెలిపారు. ఈ అంశాలపై మండల ప్రజా ప్రతినిధులు రాజకీయాలకతీతంగా కృషి చేయాలని కోరారు. అనంతరం ఎంపిపి లక్ష్మీదేవి, ఎంపిడిఒ గౌరీ దేవికి, ఇతర ప్రజాప్రతినిధులకు, అధికారులకు వినతి పత్రం అందజేశారు. రైతు సంఘం మండల కార్యదర్శి సూరి, సిఐటియు మండల కార్యదర్శి అశోక్, వ్యకాస మండల కార్యదర్శి మహబూబ్ బాషా, మండల ఉపాధ్యక్షులు యూసుఫ్ బాష, సీనియర్ నాయకులు బజారి, కెపి.రాముడు, ప్రజాసంఘాల నాయకులు సుధాకర్, కౌలుట్ల, మార్కండేయులు పాల్గొన్నారు.

ఎంపిపికి వినతిపత్రం అందిస్తున్న వ్యకాస నాయకులు

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మండలంలోని పెద్దతుంబలం పోలీసు స్టేషన్ పరిధిలో బుధవారం కర్ణాటక మద్యం తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఐ మహేష్ మాట్లాడుతూ... కోసిగికి చెందిన బోయ నాగరాజు అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తుండగా పెద్దతుంబలం శివారు కోసిగి క్రాస్ వద్ద అరెస్టు చేసినట్లు తెలిపారు. అతని వద్ద నుంచి 5 బాక్సుల కర్ణాటక మద్యం, మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

మాట్లాడుతున్న ఎస్ఐ మహేష్ కుమార్

అమ్మాయిలు చదువులో ముందుండాలి

- ఇంటర్ మొదటి సంవత్సరం జిల్లా టాపర్ మేఘనకు ఎమ్మెల్యే విరుపాక్షి ప్రోత్సాహకం

ప్రజాశక్తి - హోళగుంద

అమ్మాయిలు చదువులో ముందుండాలని ఆలూరు ఎమ్మెల్యే బి.విరుపాక్షి ఆకాంక్షించారు. సిఇసి మొదటి సంవత్సరం జిల్లా టాపర్‌గా నిలిచిన జె.మేఘనకు రూ.10 వేల ప్రోత్సాహకం అందించారు. బుధవారం హోళగుందలో నిర్మించిన కోగిలతోట శేషప్ప కాంప్లెక్స్ ప్రారంభానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రిబ్బన్ కట్ చేసి కాంప్లెక్స్‌ను ప్రారంభించారు. మండలంలో నెలకొన్న సమస్యలపై నాయకులు, కార్యకర్తలను అడిగి తెలుసుకొని వారితో ముచ్చటించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి విద్యార్థి మేఘనలాగా కష్టపడి చదివి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకు రావాలని సూచించారు. ప్రతి సబ్జెక్టుకు అధ్యాపకులు ఉన్నారా అని అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలుంటే నేరుగా తనకు సమాచారం అందించాలని తెలిపారు. పిల్లల భవిష్యత్తు బాగుండాలని తల్లిదండ్రులు వ్యవసాయ పనులు, కూలి పనులు చేస్తూ చదువుకోవడానికి కళాశాలకు పంపిస్తున్నారనే విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రతి ఒక్కరూ కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని తెలిపారు. వచ్చే సంవత్సరం పరీక్షల్లో ప్రతి ఒక్కరూ కష్టపడి చదివి రాష్ట్రానికి, ఆలూరు నియోజకవర్గానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యనందించేందుకు కృషి చేయాలని కళాశాల ప్రిన్సిపల్ ప్రవీణ, అధ్యాపకులు రమేష్, మల్లికార్జునను కోరారు. వైసిపి మండల కన్వీనర్ షఫీవుల్లా, నాయకులు మల్లికార్జున, ఎస్‌కె.గిరి పాల్గొన్నారు.

రూ.10 వేల ప్రోత్సాహకం అందిస్తున్న ఎమ్మెల్యే విరుపాక్షి

నేడు దినసరి టమోటా, కూరగాయల మార్కెట్ వేలం

- పంచాయతీ కార్యదర్శి జంప్లా నాయక్

ప్రజాశక్తి - ఆస్పరి

ఆస్పరిలోని పంచాయతీ కార్యలయం దగ్గర గురువారం దినసరి టమోటా, కూరగాయల మార్కెట్‌కు వేలం నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి జంప్లా నాయక్ తెలిపారు. బుధవారం సచివాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వేలం పాటలో పాల్గొనే వ్యాపారులు రూ.2 లక్షలు డిపాజిట్ చెల్లించి, రూ.5 లక్షల సాల్వెన్స్ ఇంటిపైన, పొలంపైన గాని సర్టిఫికెట్ తీసుకోవాలని తెలిపారు. వేలంలో పాల్గొనేవారు పంచాయతీకి ఎలాంటి అప్పు ఉండరాదన్నారు.

గుండెపోటుతో రైతు మృతి

ప్రజాశక్తి - దేవనకొండ

గుండెపోటుతో రైతు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల వివరాల మేరకు... మండలంలోని నేలతలమరి గ్రామానికి చెందిన బోయ చంద్ర (40) తనకున్న మూడు ఎకరాలతో పాటు గొర్రెల పెంపకంతో కుటుంబాన్ని పోషిస్తున్నారు. మంగళవారం రాత్రి ఓ పిచ్చి కుక్క గొర్రెలను కరవ పోయింది. చంద్ర దాని తరమడానికి వెళ్లారు. ఒక్కసారిగా ఆ పిచ్చ కుక్క వెనక్కి తిరిగి కొరకడానికి వచ్చింది. పరిగెత్తుతూ భయంతో గుండెలో నొప్పి వచ్చి అక్కడికక్కడే అపస్మారక స్థితికి చేరుకున్నారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కోడుమూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు చంద్ర మృతి చెందినట్లు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబాన్ని పోషించే పెద్దదిక్కు కోల్పోవడంతో కుటుంబ సభ్యుల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.

నిందితులను శిక్షించాలి

- మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శి నూర్ హమ్మద్

ప్రజాశక్తి - ఆదోని

గత ప్రభుత్వంలో జరిగిన అరాచకాలపై విచారణ జరిపి నిందితులను కఠినంగా శిక్షించాలని మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శి ఎ.నూర్ అహ్మద్ డిమాండ్ చేశారు. బుధవారం ఆదోనిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అత్యాచార కేసు ఆరోపణల నుంచి సజ్జన్ జిందాల్‌ను కుట్రపూరితంగా కాపాడిన మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిపై, సలహాదారు సజ్జల రామకృష్ణా రెడ్డి, ఆరోపణలు ఎదుర్కొంటున్న నాటి ఐపిఎస్‌లపై, కింది స్థాయి అధికారులపై, నటిపై తప్పుడు కేసులు పెట్టిన వ్యక్తిపై విచారణ జరిపి నిందితులను శిక్షించాలని కోరారు. గత ప్రభుత్వం చేతిలో అవమానాలు, చిత్రహింసలకు గురైన సినీ నటికి న్యాయం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబును కోరారు. ఈ సంఘటనలే నిజమైతే జగన్మోహన్ రెడ్డి గత దుర్మార్గ పాలన సిగ్గుపడేలా ప్రభుత్వం సాగిందని అర్థం చేసుకోవచ్చన్నారు. ఇలాంటి ఎందరో ఆడపిల్లల, అభాగ్యుల ఉసురు తగిలి జగన్మోహన్ రెడ్డిని రాష్ట్ర ఎన్నికల చరిత్రలో ఎన్నడూ లేనంత చిత్తుగా ప్రజలు ఓడించారన్నారు.

అధికారులు హాజరుకాని సర్వసభ్య సమావేశమెందుకు..?

- సమావేశానికి హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలి - సభ్యుల డిమాండ్

ప్రజాశక్తి - దేవనకొండ

అధికారులు హాజరు కాని సర్వసభ్య సమావేశమెందుకని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు హాజరయ్యేలా చూడాలని డిమాండ్ చేశారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో ఎంపిపి లక్ష్మీదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ప్రతి మూడు నెలలకోసారి జరిగే సర్వసభ్య సమావేశానికి సంబంధిత శాఖాధికారులు సక్రమంగా హాజరు కానప్పుడు సమావేశాలు ఎందుకని, వారు హాజరు కాకుంటే సమస్యలు పరిష్కారం కావని తెర్నేకల్ సర్పంచి అరుణ్ కుమార్, వెలమకూరు సర్పంచి భాస్కర్, ఎంపిటిసి తపాల శ్రీనివాసులు తెలిపారు. ఆర్‌టిసి, ఆర్అండ్‌బి, పశు వైద్య, విద్యుత్, ఆర్‌డబ్ల్యుఎస్ వంటి ప్రధాన శాఖల అధికారులు గైర్హాజర్ అయినప్పుడు సమస్యలు ఎలా పరిష్కారానికి నోచుకుంటాయని ఎంపిపి లక్ష్మీదేవి ఎంపిడిఒ గౌరీదేవిని ప్రశ్నించారు. అందుకు వారు సమాధానం ఇస్తూ... అధికారుల గైర్హాజరుపై సంబంధిత శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. ఎఒ సురేష్ బాబు మాట్లాడుతూ... మండలంలో 65 వేల ఎకరాల్లో వేరుశనగ, పత్తి, ఆముదం, టమోటా, జొన్న, సజ్జ వంటి పంటలను రైతులు సాగు చేశారని తెలిపారు. పంట నమోదు చేసుకున్న రైతులందరూ తప్పనిసరిగా ఈకేవైసీ చేసుకోవాలన్నారు. ఇఒఆర్‌డి సూర్యనారాయణ మాట్లాడుతూ... వర్షాకాలంలో భాగంగా తాగునీటి ట్యాంకుల శుభ్రం, పారిశుధ్య నివారణపై సర్పంచులు చర్యలు తీసుకోవాలన్నారు. ఎపిఒ కృష్ణమూర్తి మాట్లాడుతూ... ఉపాధి హామీ చట్టం కింద పండ్ల తోటలు పెంచుకునే రైతులకు చీని, మామిడి, సపోటా, సీతాఫలం, అల్లనేరుడు, నేరేడు వంటి మొక్కలను ఉచితంగా అందించి, మూడేళ్ల పాటు పోషణకు నిధులు ఇస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్న రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మేకలు, గొర్రెలు, ఆవుల పోషణదారులకు గోకులం పథకం కింద షెడ్లను ఏర్పాటు చేస్తామన్నారు. పశు పోషణ దారులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివిధ శాఖల అధికారులు తమ శాఖ పరిధిలో జరిగే పనుల గురించి వివరించారు.

సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచి భాస్కర్

అవగాహన కల్పిస్తున్న సిఐ

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

- ట్రాఫిక్ సిఐ సుబ్బారావు

ప్రజాశక్తి - ఆదోని

వాహనాలు నడిపేవారు తప్పకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చని ఆదోని ట్రాఫిక్ సిఐ గంటా సుబ్బారావు తెలిపారు. బుధవారం పట్టణంలోని శ్రీజ్యోతిర్మయి జూనియర్ కళాశాలలో ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చిన్నారులు బైక్‌లు, వాహనాలు నడపరాదన్నారు. మంచి, చెడులు ఆలోచించే సామర్థ్యం వారికి ఉండదని, ఆ వయస్సులో ఇష్టం వచ్చిన రీతిలో వేగంగా వాహనాలు నడిపి ప్రమాదాలకు కారపులవుతా రని వివరించారు. 18 ఏళ్లలోపు విద్యార్థులు బైక్‌లు నడప రాదని తెలిపారు. విద్యార్థులు ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్‌కు పాల్పడ రాదని, గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. మంచి మార్గంలో నడిచి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఎఎస్ఐ లక్ష్మయ్య ఉన్నారు.

వాల్మీకి మహర్షి విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

ఎమ్మిగనూరు మండలం కడివెల్ల గ్రామంలో ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయ నాగేశ్వర రెడ్డి వాల్మీకి మహర్షి విగ్రహావిష్కరణలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ... వాల్మీకులకు అభివృద్ధి కోసం టిడిపి ఎంతో కృషి చేస్తోందని తెలిపారు. టిడిపి మండల నాయకులు పార్లపల్లి మల్లికార్జున, తిమ్మాపురం వెంకటేష్ పాల్గొన్నారు.

గృహ ప్రవేశానికి హాజరైన వైసిపి నాయకులు

ప్రజాశక్తి - నందవరం

ఎమ్మిగనూరు మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి తనయుడు ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి నూతన గృహ ప్రవేశం బుధవారం ఘనంగా జరిగింది. వైసిపి మండల నాయకులు లక్ష్మీకాంత్ రెడ్డి, సుక్క మల్లేష్, లింగమూర్తి, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- సెప్టెంబర్ 5న ధర్నాలను జయప్రదం చేయండి - సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

విద్యుత్ సంస్థలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి.అంజిబాబు కోరారు. షిఫ్ట్ ఆపరేటర్లు, మీటర్ రీడర్స్, స్టోర్ హమాలీస్, బిల్ కలెక్టర్లను రెగ్యులర్ చేయాలని, వారి సమస్యల పరిష్కారానికి సెప్టెంబర్ 5న తిరుపతిలోని ఎపిఎస్‌పిడిసిఎల్ కార్యాలయం దగ్గర జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. బుధవారం యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు ప్రవీణ్ కుమార్ అధ్యక్షతన సిఐటియు కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ సంస్థలో పని చేస్తున్న ప్రతి కాంట్రాక్టు కార్మికుని రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. వాచ్‌మేన్ నుంచి షిఫ్ట్ ఆపరేటర్‌గా చేరిన కార్మికులకు పాత ఆపరేటర్లతో సమానంగా రూ.27,953 చెల్లించాలని కోరారు. మీటర్ రీడర్లకు, పీస్ రేట్ కార్మికులైన స్టోర్ హమాలీలు, బిల్ కలెక్టర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్లను వినియోగదారులకు అందజేయాలని ప్రయత్నిస్తోందని, దీనివల్ల మీటర్ రీడర్లు పని కోల్పోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. స్మార్ట్ మీటర్లను బిగించాలనే ప్రయత్నాలు మానుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతి సబ్ స్టేషన్‌లో నైట్ వాచ్‌మేన్‌ను నియమించాలని, పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలను చేపట్టాలని కోరారు. పెయిడ్ హాలిడేస్ ఇవ్వని జిల్లాలో వెంటనే పెయిడ్ హాలిడేస్ ఇవ్వాలని తెలిపారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం సెప్టెంబర్ 5న ధర్నాకు సంబంధించిన గోడపత్రికను విడుదల చేశారు. సిఐటియు డివిజన్ నాయకులు బి.రాముడు, ప్రవీణ్ కుమార్, రాఘవేంద్ర, యూనుస్ బాష, దేవేందర్ రెడ్డి పాల్గొన్నారు.

గోడ పత్రికలు విడుదల చేస్తున్న సిఐటియు నాయకులు

కక్షిదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ

రాజీ మార్గంలో ప్రశాంతమైన జీవితం

ప్రజాశక్తి - ఆలూరు

సమాజంలో పేద, మధ్య తరగతి కుటుంబాల మధ్య జరిగిన చిన్నపాటి గొడవలు, కక్షలు చెలరేగి కుటుంబాలు విచ్ఛిన్నమవుతున్నాయని, రాజీ మార్గం ఎంచుకుంటే ప్రశాంతమైన జీవితం ఉంటుందని ఎస్ఐ సి.వెంకట నరసింహులు తెలిపారు. బుధవారం ఆలూరు స్టేషన్ పరిధిలో కేసులు నమోదయిన ఇరువురి కక్షి దారులను ఒప్పించి రాజీ మార్గం ఎంచుకొని ఊరిని ప్రశాంతంగా ఉంచుదామని తెలిపారు. ఈనెల 14న కోర్టు పరిధిలో జరిగే మెగా లోక్ అదాలత్‌లో రాజీమార్గం ఎంచుకుందామని కక్షిదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. తగ్గితే ఓడినట్లు కాదని, మనస్సున్న మారాజువని తెలిపారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు ఇరువురు వినియోగించుకొని ఆర్థికంగా, ప్రశాంతమైన జీవనం కోసం ఉపయోగించుకోవాలని కోరారు.

తహశీల్దార్‌ను కలిసిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి - నందవరం

నూతన తహశీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసులును టిడిపి మైనార్టీ సెల్ మండల అధ్యక్షులు ఎన్ఎ.జబ్బార్ బుధవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రైతు సమస్యలను, రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలని కోరారు. టిడిపి నాయకులు గజేంద్రారెడ్డి, ఎన్ఎ.మునాఫ్ పాల్గొన్నారు.

కూచిపూడి నృత్య ప్రదర్శనలో మిల్టన్ విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి - ఆదోని

రాయలసీమ స్థాయి విద్యార్థి సాంస్కృతిక ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శనలో మిల్టన్ స్కూల్ విద్యార్థిని యు.రూపాల్ సాయి ప్రతిభ కనబరిచి మొదటి స్థానంలో నిలిచారని కరస్పాండెంట్ హెచ్.రమేష్ బాబు తెలిపారు. బుధవారం ఆదోనిలోని మిల్టన్ పాఠశాలలో నిర్వహించిన అభినందన సభలో ఆయన మాట్లాడారు. కూచిపూడి గ్రూపు డ్యాన్స్‌లో 3వ స్థానాన్ని గెలుచుకున్నారని తెలిపారు. విద్యార్థులు చదువుతోపాటు వివిధ పోటీల్లో పాల్గొనే శక్తి చిన్నప్పటి నుంచే కల్పించుకోవాలన్నారు. రూపాల్ సాయిశ్రీకి, తర్ఫీదు ఇచ్చిన అధ్యాపకులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ప్రిన్సిపల్ బి.నాగరాజు మాట్లాడుతూ... మానసికోల్లాసం ప్రతి విద్యార్థికీ ఎంతో అవసరమని తెలిపారు.

బహుమతి ప్రదానం చేస్తున్న కరస్పాండెంట్

జిఒ 84ను రద్దు చేయాలి : ఎంటిఎఫ్

నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - ఆదోని

మున్సిపల్ విద్యా వ్యవస్థకు శాపంగా మారుతున్న జిఒ 84ను రద్దు చేయాలని మున్సిపల్ ఉపాధ్యాయుల సమాఖ్య నాయకులు కోటన్న, బడుగు బసవరాజు, చంద్రమౌళి, దస్తగిరి, ఆనంద్, జంగం బసవరాజు, మద్దయ్య, మహేష్, సుధాకర్ డిమాండ్ చేశారు. బుధవారం ఆదోనిలోని వివిధ మున్సిపల్ పాఠశాలల్లో మున్సిపల్ ఉపాధ్యాయులు భోజన విరామ సమయంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మున్సిపల్ విద్యా వ్యవస్థను పాఠశాల విద్యాశాఖ ఆధీనంలోకి తెచ్చి రెండేళ్లయినా పాఠశాల విద్యాశాఖ పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. మున్సిపల్ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత, అప్‌గ్రేడ్ అయిన పాఠశాలలకు పోస్టుల మంజూరు, పాఠశాల విద్యార్థుల సంఖ్యను బట్టి ఉపాధ్యాయులను నియమించ లేదని చెప్పారు. జిఒ 117 తక్షణమే రద్దు చేయాలన్నారు. సర్వీసులను ఆధారంగా చేసుకుని పాఠశాలలకు పోస్టుల మంజూరు, బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని కోరారు. తర్వాతనే వర్క్ అడ్జస్ట్‌మెంట్ ప్రక్రియ చేపట్టాలన్నారు.

పోరాట స్ఫూర్తిని పెంపొందించుకోవాలి

- సిపిఎం జిల్లా నాయకులు అంజిబాబు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

విద్యుత్ పోరాట స్ఫూర్తిని పెంపొందించుకోవాలని సిపిఎం జిల్లా నాయకులు ఎమ్‌డి.అంజిబాబు, పట్టణ నాయకులు బి.రాముడు కోరారు. విద్యుత్ పోరాటంలో మృతి చెందిన వారికి బుధవారం స్థానిక సుందరయ్య భవన్‌లో సిపిఎం ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సిపిఎం, వామపక్షాలు, కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆనాటి పోరాటం నేటి వరకు పాలకులకు ఆందోళన కలిగిస్తోందని తెలిపారు. వామపక్ష కార్యకర్తలు, సిపిఎం కార్యకర్తలు స్ఫూర్తిదాయకమైన పోరాటాలు చేయాలని కోరారు. ఆనాటి పోలీసు కాల్పుల్లో మృతి చెందిన విష్ణువర్ధన్ రెడ్డి, రామకృష్ణ, బాల స్వాములు పోరాటస్ఫూర్తిని పెంపొందించుకోవాలన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, రాష్ట్రంలోని ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం ప్రజలకు, రైతులకు భారమయ్యే నూతన విద్యుత్ సంస్కరణలు తెచ్చిందని, వాటికి వ్యతిరేకంగా పోరాడాలని కోరారు. అహ్మద్, నరసింహులు పాల్గొన్నారు.

తిక్కారెడ్డి కుమార్తె పెళ్లిలో నాయకులు

ప్రజాశక్తి - మంత్రాలయం

పాల్గొన్న వెంకటేష్ స్వామి

టిడిపి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి కుమార్తె ప్రభావతి రెడ్డి, ప్రమోద్ కుమార్ రెడ్డి వివాహ వేడుకకు టిడిపి మండల అధ్యక్షులు పన్నగ వెంకటేష్ స్వామి హాజరయి నూతన వధూవరులను ఆశీర్వదించారు. బుధవారం కర్నూలులోని జరిగిన వివాహ వేడుకలకు టిడిపి సీనియర్ నాయకులు పూజారి వ్యాసరాజాచార్, పన్నగ వెంకటేష్ స్వామి కుమారులు అనంత శయనా దేశాయ్, తెలుగు యువత జిల్లా మీడియా కోఆర్డినేటర్ విజయరామిరెడ్డి, నాయకులు ఎల్లారెడ్డి, వట్టెప్ప గారి చిన్న సుంకప్ప, వట్టెప్ప గారి నరసింహ, హండే అనుమంతు, చిన్న భీమా, బెస్త పవన్ కుమార్, వనికె నాగరాజు, గనేకంటి రఘు, గణేకంటి రామకృష్ణ, మద్రి ఏబు తదితరులు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.

IN THE COURT OF THE HON'BLE IInd ADDITIONAL JUNIOR CIVIL JUDGE :: ADONI
O.S.NO: 417/2021.

Between:
N.Sai Vamshi Reddy. ...Plaintiff.
Versus
R.Prakash Babu. ...Defendant.

NOTICE TO DEFENDANT.

To,
R.Prakash Babu, S/o. Late R. Thomas, aged about 48 years, Hindu, Sr. Assistant, Zilla Parishad High School, Upparahal(V), Kowthalam (M), Kurnool Dist.,

Whereas the above named plaintiff filed the above suit against you for suit on promissory note. You are hereby order to take notice and appear before this court at 10.30 A.M., on 19/09/2024 in person or through advocate and file your objections if any. Else you will be set exparte and the above suit will be decided in your absence.

// By Order of the Court//
Sri C.SOMA SEKHAR,
Advocate for plaintiff,
Adoni.